

# సెంటిమెంట్ల మెట్లు

– అందే గోపాల కృష్ణమూర్తి

కథలు రాసే ఆనందమూర్తి పెళ్లి వార్తా పత్రికలలో చూసి ఒక్క నిమిషం కళ్లు చిట్లించింది ఉమ.

సుందరి అనే అమ్మాయిని గాఢంగా ప్రేమించి, దరిమిలా ఆ ప్రేమ విఫలమై పోవడం మూలంగా నైతేనేమి, సదరు సుందరి తన పాత ప్రేమ వ్యవహారాన్ని సులభంగా మర్చిపో గల్గి భర్తతో సుఖంగా కాపురం చేయడం వల్లనైతేనేమి, ఆనంద మూర్తి 'ఆడది సెంటిమెంట్ల మెట్లను ఎంత వేగంగా ఎక్కగలదో, అంతే వేగంగా లేక అంతకు రెట్టించిన వేగంతో దిగిపోనూ గలదు' అనీ, 'రోజూ మార్చే చీరల్లా సెంటిమెంట్లనుకూడా మార్చేసుకోగల నేర్పూ, చాకచక్యం అన్నీ ఒక్క ఆడదానికే ఉన్నవనీ, పెళ్ళికి ముందు ఎంత గాఢమైన ప్రేమ వ్యవహారమున్నా అనక దేవుడిచ్చిన భర్తతో అతి సునాయాసంగా ఎడ్జస్టయి పోగల కెపాసిటీ, ఓర్పూ ఆడ మనసుకే గలవనీ, ఎన్నో థియరీలను రూపొందించి వందలాది కథలను ప్రచురించి, సెంటిమెంట్లను 'మగవాడు మార్చుకోలేడనీ, అటువంటి పరిస్థితే వస్తే అతను ఆత్మహత్యకైనా పాల్పడతాడుగానీ 'రియాలిటీ'తో 'కాంప్రమైజ్' అవలేడనీ నిరూపించ ప్రయత్నించేవాడు

అతని కథలమీద 'ఫర్'గానూ, 'ఎగనిస్ట్' గానూ కూడా ఎన్నో చర్చలు చదువుకొనే అమ్మాయిల మధ్యనే జరిగేరోజుల్లో తాను కూడా ఎన్నోసార్లు పాల్గొన్నది ఉమ. అయితే అతని భావాలతో పూర్తిగా ఎప్పుడూ కూడా ఏకీభవించలేకపోయేది. తను ఎమ్మే చదివే రోజుల్లో 'ఇతనే కథలు రాసే ఆనందమూర్తి' అని ఆనందమూర్తిని క్లాస్‌మేట్ భారతి పరిచయం చేసింది.

ప్రత్యక్షంగా మనిషిని చూసేసరికి కొన్ని క్షణాలపాటు ఉమ ఆశ్చర్యంతో మునిగి పోయింది. ఆ క్షణాలు తన కింకా గుర్తు.

కథలను బట్టి ఆనందమూర్తి అంటే, ఆరడుగుల పొడుగూ, మాసినగెడ్డం, విషాదం తాండవించే ముఖం, ఎటో చూస్తున్నట్లుంటే కళ్ళూ కొద్దిగా మాసిన బట్టలూ, పోడిదగ్గూలాంటి భగ్నప్రేమికుడి లక్షణాలూ, క్వాలిఫికేషన్లూ కలిగిఉండే మనిషేమో ననుకొని ఊహించుకొన్న ఉమకి ఉషారుగా, జోవియల్‌గా మాట్లాడుతూ 'పింక్-ఫోర్ గాగుల్స్'ను అస్తమానం సరిచేసుకుంటూ చుట్టుప్రక్కలి వాతావరణాన్నంతటినీ నవ్వుల్తో ముంచేసేట్టు చేస్తున్న అయిదున్నర అడుగుల సీట్ ఆసామీ 'ఉడికోలోన్' సువాసనలను వెదజల్లుతూ 'సో అండ్ సో' ఇతనే అని పరిచయం చేయబడేసరికి, అతని కధల్లోని హీరో, హీరోయిన్ పాత్రలు రెండూ తన కళ్ళముందు అదేపనిగా తిరిగినట్లయింది. ఆనక మెల్లిగా తేరుకుని 'నమస్తే' అంటూ అతని నమస్కారానికి ప్రతినమస్కారం చేయగల్గిందే గాని, చురకలాంటి అతని నవ్వుకి బదులుగా మరో చిరునవ్వు ఇవ్వలేకపోయింది.

ఆరోజు రాత్రంతా హాస్టల్ టెర్రేస్‌మీద అతన్ని గురించిన డిస్కషనే! తనూ, భారతీ, జూవాలజీ సుశీలా, శాంతీ, శ్యామలాను! అతని భావాల్ని ఔట్‌రైట్‌గా ఖండించేసేది సుశీల మిగతావాళ్లు అదేవిటో! 'అతను చెప్పిందీ నిజమేనే!' అంటూ అతని కధల్లో కొన్నింటిని తెగ మెచ్చుకొనేవాళ్ళు. మీరు పిల్లలు. మీకేం తెల్సు? మీకు ఇంకా 'సెంటిమెంట్లు' అంటే పూర్తిగా అర్థం తెలీదు. అదేవిటో తెలిసేక అప్పుడు అతని కథలు చదివి నాతో మాట్లాడండి —' అంటూ వాళ్ళని కొట్టిపారేసేది సుశీల. ఎంత ఆలోచించినా సుశీల భావాలే తనకూ నచ్చేవి. తన భావాలకు దగ్గరగానూ ఉండేవి. 'అందుచేతనే సుశీలని కన్సల్ట్ చేసి' ఆనందమూర్తిని కడిగేస్తూ ఓ లెటర్ రాయాలి?' అనుకొని సుశీల ఇంటి వెళ్లే ప్రయత్నంలో మునిగిపోయింది ఉమ.

* * *

'నిజమే, నేనూ అదే అనుకొంటున్నాను' అన్నది సుశీల. ఆనక ఆనందమూర్తిని కాసేపు దుమ్మెత్తి పోసింది. 'ఒక్క ఆనందమూర్తేవిటి, పురుషజాతి బుద్ధే ఇంత!' అని కసిగా పళ్లు కొరుక్కున్నది. వెంటనే కలం తీసుకుని రాయడం ప్రారంభించింది.

''ఆనందమూర్తిగారికి,

సుమారు సంవత్సరం క్రితం యూనివర్శిటీ హాస్టల్లో మీరు మాకు పరిచయం చేయబడ్డారు. గుర్తుండే ఉంటుంది మీ కధల్ని ఆ మధ్య ముఖం మీదే విమర్శించినందుకు అప్పుడు మీరు సీరియస్ అయిపోయారు జ్ఞాపకం ఉందా? ఆ అమ్మాయినే నేను పేరు సుశీల ఈ మధ్యనే మీ వివాహ వార్త పత్రికలలో చూసి నేనూ, నా స్నేహితురాలు ఉమ చాలా ఆశ్చర్యపోయాం. మీరు ఎంతో పైకి ఎక్కేసి కూర్చున్న సెంటిమెంట్ల పెల్లను అంత వేగిరం ఎలా దిగగలిగేసేరా అని!

అదీ పురుషుడై య్యుండి!! కథలలో మీరు వెలిబుచ్చే అభిప్రాయాలను బట్టి మీ వ్యక్తిత్వాన్ని వేరేలా ఊహించుకొన్నాం. ఇకపై సెంటిమెంట్లను మార్చుకొనే మగవారిపైన కూడా కథలు రాస్తారని ఆశిస్తున్నాం. ఏదేమైనప్పటికీ తిరిగ్గా మీ పూర్వపు కథలను మరోసారి చదువుకొని ఆ దృక్పథంతో మిమ్మల్ని మీరు ఎనలైజ్ చేసుకో ప్రయత్నించండి. బహుశ హనీమూన్ లో ఉంటారు గనుక మిమ్మల్ని వెంటనే జాబు రాయమనడం భావ్యం కాదు. వీలైనప్పుడు మీ భావాల మార్పును తెలియజేస్తూ ఉత్తరం రాస్తే ఆనందిస్తాం. వివాహ శుభాకాంక్షలతో—సుశీల, ఉమ "

ఉత్తరాన్ని మడిచి కవర్లో పెట్టి వెనక ఎడ్రస్ వ్రాసి, ఆనందమూర్తి చిరునామాకు పోస్ట్ చేసింది సుశీల.

"రిప్లై వ్రాస్తాడంటావా?" అడిగింది ఉమ.

"రాస్తాడనుకోను. ఊహలో తను వెలిబుచ్చిన భావాలకీ, యదార్థంలో అతని ప్రవర్తనకూ ఎక్కడా సామ్యం కనపడడం లేదు గనక తేలు కుట్టిన దొంగలా మౌనం వహిస్తాడు. లేదా, ఏదో వెర్రిమొర్రి భావాలతో మరో కథ ఎక్కడో ప్రచురిస్తాడు. ఏంతైనా ఈసారి మరీ అంతగా ఆడవాళ్ళ సెంటిమెంట్లమీద విసుర్లూ, చణుకులూ విసర్లేడు. అలాగే చూస్తుండు" అంటూ ఆనందమూర్తిని బ్రీఫ్‌గా ఎనలైజ్ చేసింది సుశీల.

* * *

"పోస్ట్!"

కంగారుగా వెళ్ళి ఉత్తరం అందుకొన్నది సుశీల. "పాత స్మృతులను మరువలేక, యదార్థంతో రాజీ పడలేక అందమైన భార్యనీ, ఐశ్వర్యాన్నీ అన్నీ వదులుకొని ఈ మధ్యనే ఆత్మహత్య చేసుకొన్నాడు ఆనందమూర్తి. అతని మరణ వార్త పత్రికలలో ప్రచురింపబడటం అతని కిష్టంలేని కారణంగా, అతనితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే కొద్దిమంది పాఠకులకు మాత్రం ఈ విధంగా తెలియజేస్తున్నాం — ఆనందమూర్తి కుటుంబ శ్రేయోభిలాషులూ, అభిమానులు"—

కళ్లు తిరిగినట్లైంది సుశీలకి. అప్రతిభురాలై అలాగే నిల్చుండి పోయింది. అనుకోకుండా ఆమె కళ్లు చమర్చినయ్. ఆమె కళ్ళముందు ఊహకందని రూపంతో అన్నీ కోల్పోయి, శుష్కించిపోయిన ఆనందమూర్తి భార్య అనబడే ఓ 'స్త్రీమూర్తి' లీలగా తచ్చాడసాగింది. అన్నెం పున్నెం ఎరుగని ఆ అమాయకమూర్తి ఒక వ్యక్తి సెంటిమెంట్ల మూలంగా మోడువారిన జీవితాన్ని గడపవలసి వచ్చిందంటే ఎంతటి ఘోరం! ఆమె చేయని నేరానికి ఇంతటి కఠోర శిక్ష? పాత స్మృతులను మరువలేనివాడు మరో వ్యక్తి జీవితంతో ముడి పెట్టుకోవడం ఎందుకు? మనసు మార్చుకుని పెళ్ళి చేసుకున్నవాడు మాట్లాడకుండా సంసారం చేయడం మాని, సెంటిమెంట్ల చాంతాడుతో ఉరేసుకు చావడం దేనికి? అసలా మనిషిని పెళ్ళెవడు చేసుకోమన్నాడు?

ఉక్రోషంతో గట్టిగా అరిచింది సుశీల. అవే మాటలను ఉమతో అన్నప్పుడు

"కంపల్సరీగా వివాహం చేసుకోవల్సిన పరిస్థితి ఏర్పడిందేమోనే!" అనే అనుమానాన్ని వెళ్ళబుచ్చింది.

"అంటే!" అన్నది సుశీల విసుగ్గా.


"ఏ మూలనన్నా ముసిలావిడ అంతిమ కోర్కె అనో, లేక తల్లిదండ్రుల పట్టుదలో కారణం అయివుండచ్చుగా."

"కాటికి కాళ్ళు జాపుకు కూర్చున్న ముసిలావిడ కోర్కె కోసం మరో స్త్రీ జీవితాన్ని నాశనం చేసే సాహసం ఒక్క మగాడికే వుంది! ఏమైనా అంటే తల్లిదండ్రుల పట్టుదల అంటారు. వాళ్ళ పట్టుదల దేనికి? సంతలో పశువు నమ్మినట్టు కొడుకుల్ని బేరానికి పెట్టి వసూలు చేసే కట్నం కోసమే కదా వాళ్ల పట్టుదలా, తాపత్రయమూను! ఈ ఆనంద మూర్తి మీద రావల్సిన సొమ్ము వాళ్ల తల్లిదండ్రుల కొచ్చేసే వుంటుంది. ఆ విధంగా వాళ్ళ మాటను తీసివేయలేక వాళ్ళ తృప్తి కోసం మనువాడి, సెంటిమెట్లను మార్చుకోలేననే నెపంతో, తనను నమ్ముకున్న మరో ఆడదాని మాంగల్యంతో ఉరేసుకు చావాల్సిన పరిస్థితిని ఎందుకు కల్పించుకోవాలి? ఐ హేట్ దీజ్ ఫెలోస్."

"సుశీ!" అన్నది ఉమ.

"ఆనందమూర్తి భార్యను తల్చుకొంటుంటే గుండె చెరువై పోతుంది. ఆమె వెల్‌విషర్స్‌గా ముందొక సానుభూతి సందేశం పంపుతూ జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కోమని, అందుకు కావల్సిన వాతావరణాన్ని సృష్టించుకోవడంలో మన సహాయ సహకారా లెప్పుడూ ఉంటవనీ ఓ ఉత్తరం రాద్దాం."

"అంతే కాదు, ఆమెకు అతను చేసిన ఘోరాతి ఘోరమైన అన్యాయానికి ప్రతీకారంగా ఆమె మనసులో అతని మీదున్న సదభిప్రాయన్ని పూర్తిగా రూపు మాపి, ఆమె మళ్ళీ వివాహం చేసుకొనేట్లుగా మనం ఎంకరేజ్ చేయాలి. మళ్లీ పెళ్ళి చేసుకొనే అవకాశం వస్తే ఆమె వెంటనే



అంగీకరించేట్టుగా చేసి తీరాలి!'' అంటూ లెటర్‌ప్యాడ్ తీసుకున్నది సుశీల.

* * *

''ప్రియమైన సోదరి శ్రీమతి ఆనంద మూర్తికి,

చెల్లీ, మేం నీకు అపరిచితులం అయినా కీ.శే. ఆనందమూర్తి తన రచనల ద్వారా మాకు సుపరిచితులే! ఇటీవల నీకు జరిగిన అన్యాయానికి అమితంగా చింతిస్తున్నాం. అందుకే నీకీ ఉత్తరం రాయాలని సంకల్పించుకొన్నాం.

చెల్లీ, నీ గుండెకి తగిలిన గాయం ఇప్పట్లో మానదు. అయినా గతాన్ని మర్చిపో ప్రయత్నించు. ఆ గాయం నీ గుండెల్లో మంటల్ని పుట్టిస్తుంటుంది. ఆ మంటల్లో నీ కలల పంటలన్నీ మాడిపో కూడదు. నీ భవిష్యత్తు అందంగా మల్చుకో గలిగే మనోధైర్యాన్ని పొందు.

మనసులతో జూదమాడే మహత్తరమైన విద్య ఒక్క మగవాడికే చేతనౌను. సెంటిమెంట్ల పేరుతో మగాడు ఏం చేసినా చెల్లిపోతుంది. ఆడదాని సెంటిమెంట్ల మీద రాళ్లు రువ్వుతూ రచనలు చేసే ఆనందమూర్తి ఆత్మహత్య చేసుకొన్నాడంటే ఆశ్చర్యపోయాం. దానికి మరో అమాయకురాలి బంగారు భవిష్యత్తు బలైపోయిందంటే బాధతో క్రుంగిపోయాం. జీవితంలో ఆడది కూడా చేయలేనిదంటూ ఏదీ లేదని నిరూపించేందుకు ప్రయత్నించు చెల్లీ! అందుకు కావల్సిన అండదండలూ, ప్రోత్సాహం అన్నీ మావద్దనుంచి ఎప్పుడూ నీకు అందుతూనే ఉంటయ్.

అయితే, అన్యథా భావించకపోతే మా చిన్న విన్నపం ఒకటి మన్నించు చెల్లీ! ఈ స్వల్ప వ్యవధిలో ఆనందమూర్తి బహుశ నీ మనసులో మరచిపోలేనంత బలంగా పాతుకుపోయి ఉండి ఉండడు. నీ మనసులో ఏ భావాలు కలుగకముందే అతను నిష్క్రమించాడు గనుక, ముందు ముందు అవకాశం వస్తే, నిన్ను కోరుకునే మరో వ్యక్తి తారసపడితే ఉపేక్షించక, ధైర్యంగా స్వాగతం పలుకు! నువ్వు ఎదుర్కొనే ప్రతి సమస్యకూ, ప్రతి కష్టానికీ మా సహాయం అందించడానికి మేం ఎప్పుడూ సిద్ధంగా ఉంటామన్న విషయం గుర్తుంచుకో చెల్లీ! వీలైనంత త్వరలో జాబు వ్రాసే ప్రయత్నం చేస్తావని ఆశిస్తూ—సుశీల, ఉమ''.

* * *

''ప్రియస్నేహితులైన సుశీల, ఉమ గార్లకు!

ఆనందమూర్తి నమస్కారాలు ''

ఉత్తరం చదువుతున్న సుశీలకు చెంపమీద 'ఛెళ్లు'న తగిలినట్లైంది. ''మీ రనుకొన్నట్లుగా నేను ఆత్మహత్య చేసుకు చావలేదు. హాయిగా బ్రతికే వున్నాను. అయితే, 'పురుషునిపట్ల మీ ఆలోచనల తీవ్రత ఎలాగుంటుందీ' అన్న విషయాన్ని, మీ సైకాలజీని తెల్సుకొనే ప్రయత్నంతో 'ఆనందమూర్తి' —అంటే నేను - ఆత్మహత్య చేసికొన్నట్టుగా మీకు ఉత్తరం వ్రాయించాను. నేనూహించిన విధంగానే మీరు మళ్ళీ 'ఆనందమూర్తి'నే తూలనాడేరు. అతనికి ఆత్మహత్య చేసుకొనేందుకు కూడా హక్కు, అధికారం లేదన్నట్లు ఉత్తరం వ్రాసేరు. అంతకుపూర్వం అతను వివాహం చేసుకొన్నాడని విరుచుకుపడ్డారు. అయితే మీ ఉద్దేశ్యంలో 'ఆనందమూర్తి' ఏం

చెయ్యాలి: సెంటిమెంట్లను పట్టుకుని ఉరే సుకు వచ్చినా అతనిదే తప్పు! లేదా, వివాహం చేసుకుని సుఖపడినా అతనిదే తప్పు!—ఇదేగా మీ రెండు లేఖలలోని సారాంశం! అయితే, 'ఆనందమూర్తి'కి గానీ, అటువంటి వ్యక్తులకు గాని మీరిచ్చే పరిష్కారమేమిటి? మీరు సూచించబోయేది 'సొల్యూషన్'గా వుండాలేగాని, 'సమస్యను' మరింత జటిలం చేసేదిగా ఉండకూడదు మీరెండు ఉత్తరాలను బట్టీ చూస్తుంటే పురుషజాతిని ఈసడించుకొనే ధోరణి ఉధృతంగా ఉన్నట్టు వ్యక్తమౌతుంది. 'ఇకపై సెంటిమెంట్లను మార్చుకొనే మగవారిపై కూడా కథలు రాస్తారని ఆశిస్తున్నాం' అని వ్యంగ్యం వెలిబుచ్చారు మీ మొదటి ఉత్తరంలో. మీ రెండు ఉత్తరాలనీ చూస్తే, అంత త్వరితంగా మారిపోగల్గిన మీ సెంటిమెంట్లు స్టడీచేయాలన్పించింది. అందుచేతనే చిన్నప్రయత్నం చేసాను . నే అనుకొన్న ఫలితాలే వచ్చినయ్ ఈ 'ఎక్స్‌పెరిమెంటల్ స్టడీ'లో సహకరించిన మీకు నా కృతజ్ఞతలు. నా భార్యకు అందించిన సానుభూతి, సహాయాలకు ఆమె తరఫున కూడా నా థాంక్స్! మీ ఆనందమూర్తి ''

వాస్తవంలోకి వస్తూ తన రెండు ఉత్తరాల సారాంశాన్నీ నెమరువేసుకొనే ప్రయత్నంలో మౌనంగా కూర్చుండి పోయింది సుశీల ★


# ఆల్ ఇండియా పాప్యులారిటీ పోటీ

సహాయము కొరకు నమూనా

మొత్తం 18

| | | |
|---|---|---|
| 5 | 4 | 9 |
| 10 | 6 | 2 |
| 3 | 8 | 7 |

మొదటి బహుమతి రాజ్ దూత్ మోటారుసైకిలు, రెండవ బహుమతి టేప్ రికార్డర్; మూడవ బహుమతి (100) రు 290/- విలువగల టోయో జపాన్ మోడల్ 3 బాండ్ల ఆల్ వరల్డ్ ట్రాన్సిస్టర్ సగం ధరకే!

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |

ప్రమోటర్ల తీర్మానము ఖాయమైనది ప్రవేశరుసుము లేదు. సాదా కాగితముపై పైన చూపించినట్లు తొమ్మిది ఖాళీ గడులు తయారు చేసుకొనవలెను.

3 (మూడు) నుండి 11 (పదకొండు) వరకు గల అంకెలను ఖాళీ గదులలో నిలువుగా, అడ్డముగా, అయిమూలగా ఎటుకూడినా 21 (ఇరవై ఒకటి) వచ్చునట్లు ఒక అంకెను ఒకేసారి ఉపయోగించి పూరించవలెను బహుమతి గెలిచిన వారు పోస్టేజి, పాకింగ్, లైసెన్సు ఫీజులు చెల్లించవలెను ఎంట్రీలు హిందీలో గాని, ఇంగ్లీషులోగాని పంపవలెను ఫలితముల కొరకు 45 పైసల స్టాంపులు పంపవలెను

ముగింపు తేది 26-2-75 ఫలితముల తేది 28-2-75

**Director, NATIONAL PHILIFS (MJM-21)**
**P. O Box No. 1565, Delhi-6.**